సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం ၊ 15 ၊ ఫిబ్రవరి ၊ 2023



బ్రహ్మోత్సవాలకు రూ.1.50కోట్లు
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రూ.1.50కోట్ల బడ్జెట్ కేటాయించారు. -8లో



ఏలేశ్వరం జాతరకు వేళాయే
సాగర్ జలాశయం మధ్యన గల సింహపురి కొండపై వెలసిన ఏలేశ్వరస్వామి జాతర మహాశివరాత్రి రోజున జరుగుతుంది. - 10లో

గరిష్టం/కనిష్టం
32°/16°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదకరంగా ఉంటుంది. రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

16న జిల్లా స్థాయి చెస్ పోటీలు

భువనగిరి : కలెక్టరేట్‌లో మహిళలకు గురువారం ఉదయం 10.30 గంటలకు జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానంలో రాణించిన వారు ఈనెల 17న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడం జరుగుతుందని పేర్కొన్నారు. చెస్ పోటీల్లో పాల్గొనే మహిళల వివరాలను ఈ నెల 15న సాయంత్రం 5 గంటల వరకు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ఫోన్ నంబర్ 83099 92451కు పంపాలని కోరారు.

ఆరోగ్యమేళాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మల్లికార్జున్ రావు

వలిగొండ : ప్రజలు ఆరోగ్యమేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్‌రావు కోరారు. మంగళవారం వలిగొండ మండలంలోని పులిగిల్లలో ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఏర్పాటుచేసిన ఆరోగ్యమేళాలో ఆయన పాల్గొని బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారికి కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. జీవన విధానంలో ప్రతి ఒక్కరూ బీపీ, షుగర్‌తో బాధపడుతున్నారని, వీటిని అరికట్టడానికి వైద్యుల సూచనలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ నూతి రమేష్, వైద్యులు వరసునంద, జ్యోతి, సూపర్‌వైజర్ సువర్ణ కుమారి, వైద్య సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

కుంభకోణాలకు నిలయంగా కల్వకుంట్ల కుటుంబం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్ : రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం కుంభకోణాలకు నిలయంగా మారిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి ఆరోపించారు. ల్యాండ్, సాండ్, మైనింగ్, లిక్కర్, డ్రగ్స్ వంటి అనేక దందాలతో లక్షల కోట్ల ప్రజాధనాన్ని దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని 13వ వార్డులో నిర్వహించిన ప్రజాగోస బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దోచుకున్న సొమ్ము ప్రజలకు పంపిణీ చేసి రానున్న ఎన్నికల్లో గెలుపొందాలన్న కుట్రలకు బీఆర్ఎస్ నాయకులు తెరలేపారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడానికే అసెంబ్లీ సమావేశాలను వినియోగించుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి చైతన్యం తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, పట్టణ అధ్యక్షుడు ఊడుగు వెంకటేశం, నాయకులు కాసుల వెంకటేశం, దాసోజు భిక్షమాచారి, ఎల్లంకి పాండు, బుడ్డ సురేష్, వడిచర్ల రాజయ్య, ఉబ్బు బుచ్చయ్య, ఎలుకరాజు కోటయ్య, కైరంకొండ అశోక్, మొగుదాల రమేష్, పాక పద్మ, చిరంజీవి ఉన్నారు.

యాదాద్రీశుడి హుండీ ఆదాయం రూ.1.83 కోట్లు



హుండీల్లో వచ్చిన నగదును లెక్కిస్తున్న అధికారులు సిబ్బంది

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, నగలను మంగళవారం ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి సమక్షంలో ఆలయ అధికారులు, సిబ్బంది కొండ కింద గల శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.1,83,39,667 నగదు లభించగా, 128 గ్రాముల మిశ్రమ బంగారం, 3కిలోల 200 గ్రాములు మిశ్రమ వెండి లభించింది. ఇక విదేశీ కరెన్సీ సైతం వచ్చినట్లు ఇన్‌చార్జ్ ఈఓ తెలిపారు. ఈ ఆదాయం 21 రోజులదని అధికారులు వెల్లడించారు.

కేటీఆర్ మెచ్చిన భువనగిరి



భువనగిరి ప్రధాన రోడ్డులోని డివైడర్‌పై, రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు

- భువనగిరి ప్రధాన రహదారి విస్తరణతో నూతన శోభ
- అన్ని వార్డుల్లో బీటీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ
- అభివృద్ధిపై అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి కేటీఆర్ ప్రశంసల జల్లు
- ఎమ్మెల్యేకు అభినందనలు

సాక్షి, యాదాద్రి : అభివృద్ధిలో భువనగిరి ఆదర్శంగా నిలుస్తోంది. పెద్దచెరువు నుంచి భువనగిరి పట్టణం మీదుగా కలెక్టరేట్ వరకు పలు చోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రధాన రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ, ప్రతి వార్డులో బీటీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు, ఎల్‌ఈడీ లైట్లు, అధునాతన రైతుబజార్, జిల్లా గ్రంథాలయ భవనం, నిరాశ్రయుల భవనం, పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు పెద్దచెరువు సుందరీకరణ, విద్యార్థులు, యువత, క్రీడాకారుల కోసం అవుట్‌డోర్ స్టేడియం, మోడల్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మిస్తున్నారు. భువనగిరిలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఫొటోలతో సహా మంత్రి కేటీఆర్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సభ్యులకు వివరించారు. జరుగుతున్న అభివృద్ధిపై ప్రశంసల జల్లు కురిపిస్తూ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. కాగా.. మున్సిపాలిటీలో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించడానికి మంత్రి కేటీఆర్ త్వరలో భువనగిరికి రానున్నారు.



ఔట్‌డోర్ స్టేడియం కోసం చదును చేస్తున్న భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం

రూ.72.21 కోట్లతో అభివృద్ధి..

భువనగిరి మున్సిపాలిటీలో రూ.72.21 కోట్లతో 215 పనులు మంజూరు చేశారు. ఇందులో 140పనులు పూర్తి కాగా, 20 పనులు పురోగతిలో ఉండగా, 52 పనులు ప్రారంభించాల్సి ఉంది. టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ పట్టణ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నిధులతో మున్సిపాలిటీ పరిధిలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రెయినేజీలు, స్ట్రామ్ వాటర్ డ్రెన్‌లు, సెంట్రల్ లైటింగ్ పనులు 9 పనులు చేపట్టి 6 పూర్తి చేశారు. మరో మూడు పురోగతిలో ఉన్నాయి. రూ. కోటితో చేపట్టిన 35 సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ పనుల్లో 32 పూర్తయ్యాయి. హెచ్ఎండీఏ నిధులు రూ.18.51 కోట్లతో భువనగిరి ప్రధాన రోడ్డు విస్తరణ, అభివృద్ధి, సెంట్రల్ మీడియన్, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి కావస్తున్నాయి. రూ.8.60 కోట్లతో సిద్దిపేట మోడల్ ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పనులు పూర్తయ్యాయి. రూ.2 కోట్లతో రాయిగిరి, హుస్నేనాబాద్‌లో వైకుంఠధామాలు నిర్మించారు. రూ.39 లక్షలతో తారకరామానగర్, రెడ్డివాడ, సంజీవ నగర్‌లో బస్తీ దవాఖానాలు నిర్మించారు. రూ.6.10 లక్షలతో మిషన్ భగీరథ పనులు చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.85 లక్షలతో మంచినీటి సరఫరా మెయింటెనెన్స్, బస్తీ దవాఖానాల్లో నీటి వసతులు పూర్తి చేశారు. పట్టణ ప్రగతిలో రూ.12.85 కోట్లతో నర్సరీలు, ప్రత్యేక పారిశుద్ధ్యం, పారిశుద్ధ్య ఆటోల కొనుగోలు, సుందరీకరణ వంటి 150 పనులు చేపట్టగా, 88 పనులు పూర్తి చేశారు.

అభివృద్ధే లక్ష్యం



“భువనగిరి మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తున్నా. రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు పూర్తవుతున్నాయి. వెజ్, నాన్‌వెజ్ మోడల్ మార్కెట్ పూర్తయింది. మున్సిపాలిటీ పరిధి లో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్ త్వరలో రానున్నారు.

– పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే భువనగిరి

రెండో విడత టీయూఎఫ్ఐడీసీ నిధులు

రెండో విడత టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.17.50 కోట్లు ఇటీవల మంజూరయ్యాయి. గతంలో వార్డుల వారీగా చేసిన అభివృద్ధి పనుల మాదిరిగా కాకుండా పట్టణం యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి చేసే దిశగా అంచనాలు రూపొందిస్తున్నారు. పట్టణంలో వివిధ వార్డులను కలుపుతూ వెళ్లే సుమారు 5 కిలోమీటర్ల బీటీ రోడ్లు, జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఔట్‌డోర్ స్టేడియం అభివృద్ధి, పట్టణంలో పార్కులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మీద టౌన్ హాల్ నిర్మాణం, ప్రధాన కూడళ్ల వద్ద జంక్షన్ల అభివృద్ధి, విద్యుద్దీకరణ, అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీరోడ్లు, సీసీ డ్రైన్లు, వరదనీటి కాలువల నిర్మాణం చేపట్టనున్నారు. తాజాగా రూ. 6.50కోట్ల హెచ్ఎండీఏ నిధులు మంజూరుకాగా ఈ నిధులతో అసంపూర్తిగా ఉన్న ప్రధాన రహదారి విస్తరణ పనులను చేపడుతున్నారు.

నిలిచిన బదిలీల ప్రక్రియ

- ఉపాధ్యాయుల బదిలీలపై మార్చి 14 వరకు స్టే విధించిన హైకోర్టు
- దరఖాస్తు చేసుకున్న 327 మంది 317 జీఓ ఉపాధ్యాయులు
- ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం దరఖాస్తు చేసుకున్నది 1,802 మంది

భువనగిరి : ఉపాధ్యాయుల బదిలీలపై మార్చి 14 వరకు హైకోర్టు స్టే విధించింది. బదిలీ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయంటూ నాన్ స్పౌజ్ టీచర్ల అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీంతో ఉద్యోగ దంపతులు, యూనియన్ నాయకులు అదనపు పాయింట్లపై అభ్యంతరం తెలుపుతూ కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మార్చి 14 వరకు స్టే విధించింది. దీంతో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మరోసారి నిలిచిపోయింది. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఉపాధ్యాయుల బదిలీలపై దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. ఈ క్రమంలో 317 జీఓ ప్రకారం జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులు తమకు బదిలీల్లో అవకాశం కల్పించాలని కోర్టును ఆశ్రయించడంతో వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో ప్రభుత్వం ముందుగా ప్రకటించిన షెడ్యూల్‌ను సవరించి 317 జీఓ ఉపాధ్యాయులకు ఈ నెల 12నుంచి 14 వరకు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ షెడ్యూల్‌ను సవరించింది. ఈ ప్రక్రియ మంగళవారంతో ముగియాల్సి ఉండగా మళ్లీ కోర్టు విధించిన స్టేతో ఈ ప్రక్రియ మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది.



డీఈఓ కార్యాలయంలో బదిలీల దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

స్వీకరించిన దరఖాస్తులు 2,129

317 జీఓ ప్రకారం జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకునే గడువు మంగళవారంతో ముగిసింది. 450 మందికి గాను 327 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 1802 మంది దరఖాస్తులు చేసుకోగా 317 జీఓ ఉపాధ్యాయులతో కలిపి మొత్తం బదిలీల కోసం 2129 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటికే ముందుగా దరఖాస్తు చేసుకున్న వారి హార్డ్ కాపీలను పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందుపర్చే ప్రక్రియ పూర్తి చేశారు. తాజాగా బదిలీల కోసం అవకాశం పొందిన 317 జీఓ ఉపాధ్యాయులకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా డీఈఓ కార్యాలయానికి అందజేసిన హార్డ్ కాపీలను పరిశీలించే కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించారు. ఇప్పటి వరకు మొత్తం 1947 దరఖాస్తులను పరిశీలించి సంబంధిత పోర్టల్‌లో పొందుపర్చారు. అయితే బదిలీలపై కోర్టు స్టే విధించడంతో ఈ ప్రక్రియ ఇప్పట్లో పూర్తవుతుందా లేదా అనే సందేహాలు ఉపాధ్యాయుల్లో నెలకొన్నాయి.

హనుమంతుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. ప్రధానాలయం, విష్ణు పుష్కరిణి, అనుబంధ ఆలయాలైన శివాలయం, పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయస్వామిని భక్తులు మొక్కుకొని పూజలు చేశారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి.



ఆంజనేయస్వామికి హారతినిస్తున్న ఆచార్యులు

బస్టాండ్‌ను యథావిధిగా కొనసాగించాలి

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌ను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ అఖిల పక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన రహదారిపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్‌ను పట్టణ నడిబొడ్డు నుంచి తీసేయాలని చూస్తున్నారని, ఈ బస్టాండ్‌ను తొలగిస్తే వందలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడతారన్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు, యాదాద్రి క్షేత్రానికి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న చోట కాకుండా నూతనంగా రింగ్ రోడ్డులో నిర్మించిన బస్టాండ్ వద్దకే అన్ని బస్సులు వెళ్లడంతో పట్టణంలో ఉన్న బస్టాండ్‌కు వచ్చి, వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంతకు ముందు ఆర్టీసీ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాటబత్తిని ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మంద శంకర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేశం, కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, నాయకులు బెలిదే అశోక్, బండి జంగమ్మ, బందారపు భిక్షపతి, గుండ్లపల్లి శ్రీరాం, పేరబోయిన మహేందర్, కల్వకొలను సతీష్‌రాజ్, బొజ్జ సాంబేష్, గుండు నర్సింహా, బండి అనిల్ తదితరులున్నారు.



యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న అఖిల పక్షం, ప్రజా సంఘాల నాయకులు



విగ్రహాలను సిద్ధం చేస్తున్న ఆచార్యులు



విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

- యాదాద్రి కొండపై రామలింగేశ్వరాలయంలో 17న కల్యాణం, 19న రథోత్సవం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కొండపైన అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను బుధవారం నుంచి ఈ నెల 20 వరకు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆచార్యులు, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన శివాలయంలో ఉద్ఘాటన, పునఃదర్శనాల ప్రారంభం తరువాత వస్తున్న మొదటి శివరాత్రి కావడంతో ఉత్సవాలను వైభవంగా జరిపించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆలయాన్ని శుభ్రం చేయడం, ఉత్సవ మూర్తులను సిద్ధం చేయడం, ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాల బిగింపు వంటి పనులు పూర్తి చేశారు. అరటి, మామిడి తోరణాలతో అలంకరించే పనిలో సిబ్బంది ఉన్నారు.

పూజల్లో పాల్గొనేందుకు టిక్కెట్లు..

శివాలయంలో మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించే వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు టికెట్‌పై పూజలు చేసే విధంగా అధికారులు నిర్ణయించారు. 17న శివ కల్యాణోత్సవంలో పాల్గొనే వారికి రూ.516 (ఇద్దరికి), 18న మహా శివరాత్రి రోజున అభిషేకానికి రూ.300, రాత్రి జరిగే శతరుద్రాభిషేకానికి రూ.516 (ఇద్దరికి), 19వ తేదీన లక్ష బిల్వార్చనలో పాల్గొనేందుకు రూ.516 (ఇద్దరికి) టిక్కెట్ రుసుము ఉంటుందని అధికారులు ఇప్పటికే వెల్లడించారు.

స్వస్తి వాచనంతో శ్రీకారం

శివాలయంలో బుధవారం ఉదయం 10.30గంటలకు స్వస్తి వాచనంతో ఉత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుడతారు. 16న భేరీపూజ, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం నిర్వహించనున్నారు. 17న రాత్రి 7గంటలకు శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం ఆలయ కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. 18న మహా శివరాత్రిని పురస్కరించుకొని అభిషేకాలు, రాత్రి మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకాలు భక్తులచే జరిపించనున్నారు. 19న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లక్ష బిల్వార్చన, రాత్రి ఆలయంలో శ్రీరామలింగేశ్వరస్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు. 20న మధ్యాహ్నం పూర్ణాహుతి, రాత్రి డోలోత్సవంతో ఉత్సవాలు సమాప్తి కానున్నాయి.

ప్రమాదాల నివారణకు చర్యలు

- జాతీయ రహదారుల సంస్థ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి



సింగన్నగూడెం వద్ద చౌరస్తాను పరిశీలిస్తున్న జాతీయ రహదారుల సంస్థ ఇంజనీర్

భువనగిరి : పట్టణంలోని సింగన్నగూడెం వద్ద చౌరస్తాను మంగళవారం జాతీయ రహదారుల సంస్థ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా చౌరస్తా వద్ద అండర్ ప్రాస్ బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేస్తున్న ప్రదేశానికి వెళ్లి వారితో మాట్లాడారు. చౌరస్తా వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం చౌరస్తా వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయడంతో పాటు 15 ఇంచుల మందంతో వైట్ పెయింటింగ్ వేయిస్తామని చెప్పారు. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. అనంతరం దీక్షను విరమింపజేశారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్, నాయకులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అతహార్, నాయకులు జగన్మోహన్, వెంకటేశం, రఘుబాబు, కృష్ణ, ప్రభాకర్, గోపి ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి



ఆయిల్ పామ్ మొక్కలు పరిశీలిస్తున్న కంచర్ల రామకృష్ణారెడ్డి

ఆలేరురూరల్ : ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో రైతు తోట మధుకర్ వ్యవసాయ క్షేత్రంలో ఇటీవల 5ఎకరాల్లో నాటిన ఆయిల్ పామ్ మొక్కలను ఆయిల్ ఫెడ్, ఉద్యానవనశాఖ అధికారులతో కలిసి మంగళవారం రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటలపై దృష్టి కేంద్రీకరించిందన్నారు. యదాద్రి జిల్లాలో వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుందని చెప్పారు. మోత్కూర్ మండలం పాలడుగు గ్రామంలో 50 ఎకరాల విస్తీర్ణంలో 4లక్షల మొక్కలను సంవత్సర కాలంగా పెంచుతున్నారని ఈనెల 17న మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తునట్లు పేర్కొన్నారు. ఆలేరు మండలంలో 80 ఎకరాల్లో 20 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మల్లేషం, మామిడాల ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు

- దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన వారి సంఖ్య 65,595 మంది
- వీరికి ఉచితంగా ఎన్‌సీడీ కిట్ల పంపిణీ
- ఇప్పటికే జిల్లాకు చేరిన 51,524 కిట్లు

భువనగిరి : దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్(మధుమేహం) వంటి వాటి బారిన పడే వారి సంఖ్య జిల్లాలో పెరుగుతోంది. ఒకప్పుడు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల వయసు వచ్చిన తర్వాత బీపీ, షుగర్ వంటి వ్యాధులు వచ్చేవి. ప్రస్తుతం 30 సంవత్సరాలు దాటితే చాలు ఈ వ్యాధులు వస్తున్నాయి. జిల్లాలో దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్న వారికి సంఖ్య ఏటేటా పెరుగుతూ వస్తోంది. దీంతో వీరికి ప్రభుత్వం ఉచితంగా మందులను ఇచ్చేందుకు నిర్ణయించింది. ఇందుకోసం తాజాగా జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డీసీసెస్) కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలో 65,595 ఎన్‌సీడీ కిట్లు రావాల్సి ఉండగా ప్రస్తుతం 51,524 కిట్లు వచ్చాయి.

22,628 మంది షుగర్ వ్యాధిగ్రస్తులు

జిల్లా వ్యాప్తంగా 22,628 మంది షుగర్ వ్యాధిగ్రస్తులు ఉండగా బీపీతో బాధపడుతున్న వారు 42,967 మంది ఉన్నారు. గత రెండు సంవత్సరాల క్రితం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సిబ్బంది జిల్లా వ్యాప్తంగా బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో గతంలో ఉన్న వ్యాధిగ్రస్తుల కంటే ఎక్కువ సంఖ్యలో వ్యాధిగ్రస్తులను గుర్తించారు.



శరీరమంతా ప్రభావం

మధుమేహం శరీరమంతా ప్రభావం చూపుతుంది. రక్తనాళాలు, గుండె, కిడ్నీ, కళ్లు, కాలేయం, వంటి అన్ని అవయవాలను దెబ్బతీస్తుంది. నాడీ మండలాన్ని సైతం వదలదు. మన ఆలోచనలు, కదలికలకు మూలమైన మెదడు మీద కూడా దుష్ప్రభావం చూపుతుంది. జ్ఞాపక శక్తిని క్షీణింపచేస్తూ ఇతర వ్యాధులు వచ్చే పరిస్థితికి దారి తీస్తుంది. ఇలాంటి దీర్ఘకాలిక మధుమేహం వ్యాధిని ముందు నుంచే రాకుండా చూసుకోవాలని వైద్యులు అంటున్నారు.

ఎన్‌సీడీ కిట్ల అందజేత..

గతంలో బీపీ, షుగర్ వ్యాధితో పాటు ఇతర వ్యాధులు ఉన్నవారికి 104 వాహనం ద్వారా మందులు పంపిణీ చేసేవారు. వీరికి ప్రస్తుతం ఎన్‌సీడీ కిట్ల రూపంలో మందులను అందజేస్తున్నారు. ఎన్‌సీడీ కిట్లలో బీపీ బాధితులకు మూడు రకాలు, షుగర్ వ్యాధిగ్రస్తులకు రెండు రకాల మందులను కిట్ ద్వారా అందజేస్తున్నారు. ఇప్పటికే ఈ నెల 13న మంత్రి జగదీశ్‌రెడ్డి పంపిణీ చేసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో జిల్లాలోని ప్రధాన ఆస్పత్రులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి గుర్తించిన వ్యాధిగ్రస్తులకు కిట్లను అందజేసే కార్యక్రమాన్ని వేగవంతం చేశారు.

ఎన్‌సీడీ కిట్లను పంపిణీ చేస్తున్నాం



“జిల్లాలో గుర్తించిన బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఎన్‌సీడీ కిట్ల ఉచితంగా పంపిణీ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమైంది. కిట్లను ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందజేశాం. అక్కడి నుంచి వ్యాధిగ్రస్తులకు అందించడం జరుగుతుంది. వ్యాయామం, యోగా వంటి ఆసనాలు చేయడం ద్వారా ఈ వ్యాధి బారిన పడకుండా ఉండే అవకాశం ఉంటుంది. ఎవరైనా వ్యాధిగ్రస్తులు ఉంటే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కిట్లను పొందవచ్చు.

– డాక్టర్ మల్లికార్జున్‌రావు, డీఎంహెచ్ఓ

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు రూరల్ ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపారు. రామాపురం క్రాస్‌రోడ్ శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. సుమారు 55 సంవత్సరాల వ్యక్తి అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని కోదాడ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహాలకు పోస్టుమార్టం

మోతె : మోతె మండల పరిధి అన్నారిగూడెం గ్రామ శివారు పాలేరు రిజర్వాయర్‌లో ఆదివారం లభ్యమైన ఇద్దరి మృతదేహాలకు సోమవారం పోలీసులు పోస్టుమార్టం చేయించారు. మృతదేహాలు బాగా కుళ్లిపోవడంతో అక్కడే ఖననం చేసినట్లు ఎస్‌ఐ నాగభూషణం తెలిపారు.

పోలీసుల అదుపులో రౌడీ షీటర్లు ?

మిర్యాలగూడ అర్బన్: తరచూ నేరాలకు పాల్పడుతున్న కొందరు రౌడీషీటర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పాత నేరస్తులు, రౌడీ షీటర్లు సెటిల్‌మెంట్లు చేస్తుండటంతో పాటు కొంత మంది గంజాయి సరఫరాలో కీలక భూమిక పోషిస్తున్న వారిపై ఎస్పీ అపూర్వారావు కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పోలీస్‌స్టేషన్ల తనిఖీకి వచ్చిన సందర్భంలో రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొంది. దీనిలో భాగంగా సమగ్ర రిపోర్టు తెప్పించుకున్నట్లు సమాచారం. దీంతో సోమవారం అర్ధరాత్రి మిర్యాలగూడ పట్టణంలో 13మంది యువకులను అదుపులోకి తీసుకుని టాస్క్ ఫోర్స్ కార్యాలయానికి తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. వీరిలో కొందరు రౌడీ షీటర్లు కాగా మరి కొందరు గంజాయి విక్రయాలలో కీలక భూమిక పోషించే వారున్నట్లు తెలిసింది.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

రామన్నపేట : అనుమానాస్పద స్థితిలో రైతు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని సర్నేనిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని అంబబావిగూడెం గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబబావిగూడేనికి చెందిన చింతల నర్సిరెడ్డి(58) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం పొలం పనుల నిమిత్తం వ్యవసాయబావి వద్దకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గ్రామస్తులు అతనికోసం వెతకగా సమీపంలోని కుంటకట్ట వద్ద అపస్మారకస్థితిలో పడిపోయి ఉన్నాడు. దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతికి కారణాలు తెలియదు. విషపురుగు కాటువేయడం వల్ల లేదా ఇతర అనారోగ్య సమస్యల వల్ల మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుమారుడు దయాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు రూ.1.50కోట్ల బడ్జెట్

- 21నుంచి యాదాద్రీశుడి ఉత్సవాలు
- లక్ష్మీ పుష్కరిణిలో భక్తుల కోసం చక్రతీర్థ స్నానం
- యాదాద్రి ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ, అనువంశిక ధర్మకర్తలు వెల్లడి


యాదాద్రీశుడి ప్రధానాలయం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి వెల్లడించారు. ఈ నెల 21వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాలకు రూ.1.50కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు తెలిపారు. మంగళవారం ఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధానాలయం ఉద్ఘాటన తరువాత వస్తున్న ప్రథమ బ్రహ్మోత్సవాలను వైభవంగా, ఆగమ శాస్త్రం నిర్వహిస్తామన్నారు. తాత్కాలిక విద్యుదీపాలంకరణకు రూ.50లక్షలు, ఆలయమంతా పుష్పాలు, అలంకరణకు రూ.20లక్షలు, మిగతా రూ.80లక్షలు బ్రహ్మోత్సవాల నిర్వహణకు కేటాయించినట్లు వివరించారు. ఈ ఉత్సవాల్లో 100 మంది పారాయణికులు, ఆచార్యులు, రుత్వికులు పాల్గొంటారని తెలిపారు. అంతే కాకుండా కల్యాణోత్సవంలో 10వేల మందికి పైగా భక్తులు కూర్చొని తిలకించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇక బుధవారం నుంచి కొండపైనే గల శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి వారి మహా శివరాత్రి ఉత్సవాలను సైతం వైభవంగా జరిపిస్తామన్నారు.

లక్ష్మీ పుష్కరిణిలో భక్తుల కోసం..

యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 2వ తేదీన నిర్వహించే చక్రతీర్థం ఉదయం కొండపైన విష్ణుపుష్కరిణిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు, స్థానికుల కోరిక మేరకు కొండ కింద ఏర్పాటు చేసిన లక్ష్మీ పుష్కరిణిలో చక్ర తీర్థ స్నానానికి అవకాశం కల్పించామన్నారు. కొండపైన శ్రీస్వామి వారి చక్రతీర్థం పూర్తయిన తరువాత ప్రచార రథంలో ప్రత్యేక కుంభంలో చక్రతీర్థ నీటిని ఊరేగింపుగా తీసుకెళ్లి లక్ష్మీ పుష్కరిణిలో కలిపి భక్తులు స్నానాలు ఆచరించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో వైటీడీఏ, యాదాద్రి ఆలయం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం 9గంటల నుంచి రాత్రి 10గంటల వరకు కొండపైన వీఐపీ పార్కింగ్ వద్ద ఆలయం ఆధ్వర్యంలో సాయంత్రం 6గంటల నుంచి 9గంటల వరకు బ్రహ్మోత్సవ మండపం వద్ద వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఇందుకు సంబంధించిన వేదికలను సైతం సిద్ధం చేస్తామన్నారు. ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు 26వ తేదీ నుంచి, వైటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలు 24వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయన్నారు.

ప్రథమ ప్రాకారంలో సేవల అలంకరణలు

స్వామివారి ఉత్సవాల్లో ప్రధానమైనవి అలంకార, వాహన సేవలని వెల్లడించారు. ప్రథమ ప్రాకారంలోని ఉత్తర దిశలో ఉన్న మండపంలో స్వామి వారిని అలంకరించి సేవలను ఉత్తర రాజగోపురం నుంచి మాఢవీధుల్లో ఊరేగిస్తామన్నారు. తూర్పు రాజగోపురం ముందు ఏర్పాటు చేసే వేదిక వద్ద శ్రీస్వామి వారి అలంకార సేవను అధిష్ఠించి ఆచార్యులు, పారాయణికులు, రుత్వికులు పారాయణాలు పఠిస్తారన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణారావు

నిత్య పూజలు రద్దు

స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 21వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు భక్తులచే జరిపించే నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, శ్రీసుదర్శన నారసింహ హోమాలను రద్దు చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఈఓ తెలిపారు. వచ్చే నెల 2, 3 తేదీల్లో భక్తులచే నిర్వహించే అభిషేకాలు, అర్చనలు సైతం రద్దు చేశామన్నారు. 27వ తేదీ నుంచి 1వ తేదీ వరకు అర్చనలు, బోగములు జరపబోమని చెప్పారు.

బ్రహ్మోత్సవాలకు సీఎంతో పాటు మంత్రులు

యాదాద్రీశుడి కల్యాణం రోజున సీఎం కేసీఆర్ ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తారని ఈఓ చెప్పారు. ఇందుకు మంత్రులు జగదీశ్‌రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్‌రెడ్డిలతో కలిసి సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తామన్నారు. శ్రీస్వామి వారి కల్యాణోత్సవానికి పోచంపల్లి చేనేత సంఘం వారిచే పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు.

యాదాద్రిలో కట్టుదిట్టమైన భద్రత

- భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర తెలిపారు. మంగళవారం భద్రత ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో పాటు ఆచార్యులు, ఇతరులకు ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు నిర్వహిస్తామన్నారు. త్వరలోనే అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, ఉత్సవాల నిర్వహణపై చర్చిస్తామని చెప్పారు. అంతకు ముందు శ్రీస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఏసీపీ నర్సింహారెడ్డి, సీఐ సైదయ్య, దయాకర్‌రెడ్డి, రాజన్‌బాబు, రాంమోహన్ తదితరులున్నారు.


ఆలయాధికారులు, పోలీసులతో మాట్లాడుతున్న డీసీపీ రాజేష్‌చంద్ర

గోపాల్‌రెడ్డి ఆశయ సాధనకు కృషిచేయాలి

గరిడేపల్లి : శ్రీఅరబిందో గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గంటా గోపాల్‌రెడ్డి ఆశయ సాధనకు కృషిచేయాలని ఆ సంస్థ డైరెక్టర్ గంటా అమరేందర్‌రెడ్డి కోరారు. గోపాల్‌రెడ్డి జయంతిని మంగళవారం సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం చైర్మన్, దూపాడు సర్పంచ్ బిట్టు నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ మహాత్మాగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా 7 గ్రామాలకు సాగునీరు అందే విధంగా ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోర్డినేటర్ బి.లవకుమార్, రామినేని సత్యం, కేవీకే శాస్త్రవేత్తలు సీహెచ్ నరేష్, కిరణ్, నరేష్, మాధురీ, సుగంధీ, ఆదర్శ్, సిబ్బంది ఉపేందర్, కృష్ణ, ప్రభాకర్, ప్రవీణ్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న గంటా అమరేందర్‌రెడ్డి

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

త్రిపురారం : వ్యవసాయ సాగులో రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్‌లో డ్రోన్ ద్వారా కలుపు మందుల పిచికారీ విధానంపై జిల్లాలోని రైతులకు అవగాహన కల్పించారు. కలుపు మందుల పిచికారీకి డ్రోన్ వినియోగిస్తే కూలీల ఖర్చులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.


డ్రోన్‌తో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఆర్థిక ఇబ్బందులతో సర్పంచ్ ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మల్లేశ్

దేవరకొండ: ఆర్థిక ఇబ్బందులతో సర్పంచ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన దేవరకొండ మండలంలోని చింతబావి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతబావి గ్రామపంచాయతీ సర్పంచ్ నోముల మల్లేశ్ ఎన్నికల సమయంలో జరిగిన ఖర్చులతో అప్పుల పాలయ్యాడు. దీనికి తోడు గతేడాది మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీలో రూ.4.80లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు, మోటారు రిపేర్, తదితర పనులకు గాను మరో రూ.4.50లక్షలకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉంటే సర్పంచ్ ఎన్నికల సందర్భంగా చేసిన అప్పులు తీర్చేందుకు తనకున్న 30 గుంటల భూమిని అమ్మాడు. మిగతా అప్పులకు రోజు రోజుకూ ఒత్తిడి పెరుగుతూ వస్తోంది. దాదాపు రూ.20లక్షల మేర అప్పులు ఉన్నట్లు బాధితుడు పేర్కొన్నాడు.

కలిసిరాని వ్యవసాయం

సర్పంచ్ నోముల మల్లేశ్ తనకున్న రెండు ఎకరాలకు తోడు గ్రామంలో మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. పత్తి సాగుకు సుమారు రూ.70వేల వరకు పెట్టుబడి పెట్టాడు. పంట సాగుకు తెచ్చిన అప్పుల వారి నుంచి ఒత్తిడి పెరిగిపోయింది. ఈ క్రమంలోనే మానసికంగా మనోవేదనకు గురైన మల్లేశ్ సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారు హుటాహుటిన దేవరకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

బహుజనులు ఐక్యంగా ఉండాలి

- దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్

నిడమనూరు: బహుజనులు ఐక్యంగా ఉండాలని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ అన్నారు. 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర మంగళవారం రాత్రి నిడమనూరుకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటును ఇతరులకు అమ్ముకోవద్దని సూచించారు. స్వరాజ్య యాత్ర ద్వారా సబ్బండ వర్గాలకు రాజ్యాధికారం సాధించే దిశగా బహుజనులను చైతన్యం చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు, మండల అధ్యక్షుడు రమేష్, సాయి, రమేష్, మహేందర్, ప్రతీక్, శివకృష్ణ పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న విశారదన్ మహారాజ్

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన


రహదారిపై ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

దేవరకొండ: డిండి మండల పరిధిలోని జేత్యతండాకు చెందిన రమావత్ గన్యా మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం దేవరకొండలోని జడ్చర్ల-కోదాడ ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. గంటకు పైగా ప్లకార్డులతో రాస్తారోకో నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు మృతికి కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ఆందోళనతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కిలో మీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావుతో పాటు పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మృతుని కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మఠంపల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన తిరుమలరెడ్డి రాజారెడ్డి (54) భార్యతో వివాదాల కారణంగా ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలోనే మద్యానికి బానిసగా మారాడు. నాలుగు రోజులుగా ఇంటినుంచి బయటికి రాలేదు. దుర్వాసన వస్తుండంతో సమీప బంధువు పూజిత్‌రెడ్డి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. అతిగా మద్యం తాగి అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం


ప్రేమ్‌కుమార్ (ఫైల్)

మఠంపల్లి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. భువనగిరి, మఠంపల్లి, కేతేపల్లి మండలాల పరిధిలో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణాజిల్లా నందిగామకు చెందిన గొట్టిపాటి శ్రీనివాసరావు(55), నాగేశ్వరరావు, డ్రైవర్ ప్రసాద్‌తో కలిసి కారులో గురజాల నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో మట్టపల్లి కృష్ణానది వంతెన వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను, మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు జగదీష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు..

భువనగిరి : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన నడిపే వెంకటస్వామి(55) కుటుంబ సభ్యులతో కలిసి భువనగిరి మండలంలోని తుక్కాపురం గ్రామ పరిధిలో గల మామిడి తోటలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం మంగళవారం గ్రామం నుంచి భువనగిరికి బైకుపై వస్తున్నాడు. పట్టణంలోని ఎంఎస్ వైన్స్ సమీపంలోకి రాగానే నల్లగొండ నుంచి భువనగిరి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు వెనక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మఠంపల్లి : ఘటనాస్థలిలో శ్రీనివాసరావు మృతదేహం, గాయపడిన నాగేశ్వరరావు, ప్రసాద్

ఆగి ఉన్న లారీని ఢీకొని..

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామానికి చెందిన బయ్య ప్రేమ్‌కుమార్(28) కుటుంబంతో కలసి నకిరేకల్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం బైక్‌పై గ్రామానికి వచ్చిన ప్రేమ్‌కుమార్ తిరిగి రాత్రి వేళ నకిరేకల్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో కొర్లపహాడ్ శివారులో ఏఎమ్మార్పీ–డీ49 కెనాల్ సమీపంలో రోడ్డు వెంట హోటల్ ముందు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ప్రేమ్‌కుమార్ తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ప్రేమ్‌కుమార్‌కు భార్య, కూతురు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో చేనేత కార్మికుడు మృతి


దివ్యాంగుడు రమేశ్(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : గుండెపోటుతో దివ్యాంగ చేనేత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన గొట్టిముక్కల రమేశ్(38) ఏడేళ్ల క్రితం మహారాష్ట్రంలో జరిగిన రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకొని ఆవిటివాడయ్యాడు. ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో కృత్రిమకాళ్లను అమర్చుకొని మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకొంటున్నాడు. కాగా రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. అయితే ఆర్థిక స్థోమత లేక వైద్యం చేయించుకోలేక పోయాడు. దాంతో సోమవారం అర్ధరాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడు రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల రమేశ్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా మంగళవారం పలువురు చేనేత నాయకులు రమేశ్ మృతదేహన్ని సందర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్ రూ.5వేలు, చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తెలంగాణ చేనేత జన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, వీ అండ్ షీ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ గ్రావ్యారెడ్డి, మురళి తదితరులు సంతాపం తెలిపారు.

ఎంపీ కోమటిరెడ్డి వ్యాఖ్యలు సరికాదు


పున్న కైలాస్

నల్లగొండ : భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కై లాష్ నేత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వివిధ సామాజిక మాధ్యమాల్లో దుమారం లేపుతున్నాయని, అలాంటి వ్యాఖ్యల పట్ల పార్టీ కార్యకర్తలు అధైర్య పడవద్దని కోరారు.. కాంగ్రెస్ పార్టీ బీఆర్‌ఎస్‌తో జత కట్టడం సాధ్యం కాదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఏపూరులో వ్యక్తి దారుణ హత్య

- గొడ్డలితో నరికి తల, మొండెం వేరు చేసిన ప్రత్యర్థులు


వీరయ్య (ఫైల్)

ఆత్మకూర్-ఎస్(సూర్యాపేట) : మిరప చేలో పడుకున్న వ్యక్తిని గొడ్డలితో దారుణంగా నరికి హత్య చేశారు. ఈ ఘటన ఆత్మకూర్ (ఎస్) మండలం ఏపూరులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుండ్లపల్లి వీరయ్య (43)ముదిరాజ్ సంఘంలో క్రియాశీలకంగా పనిచేశాడు. వీరయ్య భార్య సైదమ్మ కాంగ్రెస్ పార్టీ సానుభూతితో వార్డు మెంబర్‌గా గెలిచింది. కాగా, మంగళవారం తన చెల్కలో మిరప చేనుకు నీళ్లు కట్టేందుకు వీరయ్య ఉదయం 10 గంటల సమయంలో వెళ్లాడు. 2 గంటల సమయంలో కరెంట్ పోవడంతో మిరపచేలో నిద్రపోయాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో మెడపై బలంగా నరకడంతో తల మొండె వేరు కావడంతో వీరయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, ఉదయం మిరప చేను వద్దకు వెళ్లిన వీరయ్య సాయంత్రమైనా ఇంటికి రాలేదు. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయక పోవడంతో కుటుంబసభ్యులు చేను వద్దకు వెళ్లి చూడగా తల,మొండెం వేరు చేయబడి రక్తపు మడుగులో పడిఉన్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరయ్యకు గ్రామంలో సౌమ్యుడిగా పేరుంది. రాజకీయ, వ్యక్తిగత, భూ వివాదాలు లేవు. హత్యకు గల కారణాలు తెలియ రాలేదు. ఘటన స్థలాన్ని సీఐ సోంనారాయణ సింగ్, ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి పరిశీలించారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి

రామగిరి(నల్లగొండ) : ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్స్ రాష్ట్ర అధ్యక్షుడు పాలకుర్తి కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జిల్లా అధ్యక్షుడు నూలక జగదీశ్‌చంద్ర అధ్యక్షతన యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాలు ఆలస్యంగా రావడం వల్ల బ్యాంకు ఈఎంఐల చెల్లింపులకు ఇబ్బంది అవుతోందన్నారు. పెన్షనర్లు, సీనియర్ సిటిజన్లకు కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో క్యాష్‌లెస్ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పందిరి శ్యాంసుందర్, కుకుడాల గోవర్ధన్, అబ్దుల్ ఖాదర్, పి.విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు యానాల కృష్ణారెడ్డి, వాణిశ్రీ, సత్తయ్య, లింగారెడ్డి, కోడి మల్లయ్య, కౌసల్య, సీహెచ్.భిక్షమయ్య, గుండాల భిక్షమయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి


శివాని (ఫైల్)

మునుగోడు : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కల్వలపల్లి గ్రామానికి చెందిన దాసరి శివాని (17) నల్లగొండలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతోంది. ఆమె గత నెల 28న ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందింది. తన ఆత్మహత్యకు గ్రామానికి చెందిన వెంకన్న కారణమని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. మృతురాలి నాయనమ్మ మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.


కల్వలపల్లి గ్రామంలో ఆందోళన చేస్తున్న శివాని కుటుంబ సభ్యులు

మృతదేహంతో ఆందోళన

శివాని ఆత్మహత్యకు కారణమైన వారిని చట్టపరంగా శిక్షించాలని బాలిక కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాలిక మృతదేహాన్ని గ్రామానికి చెందిన వెంకన్న ఇంటి ముందు వేసి ఆందోళన చేశారు. పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.